క్లుప్తంగా

రూప్లా తండాలో జ్వరాలపై అప్రమత్తం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కల్హేర్(నారాయణఖేడ్): జ్వరం, చికున్ గున్యా లక్షణాలు ఉంటే అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశించారు. ఆదివారం సిర్గాపూర్ మండలం వంగ్దల్ రూప్లా తండాను ఆయన సందర్శించారు. తండాలో వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితుల వివరాలు, మందులను పరిశీలించారు. చికున్ గున్యా లక్షణాలతో బాధపడుతున్నారని తెలిసిన వెంటనే డీఎంహెచ్‌ఓ గాయత్రీదేవితో మాట్లాడి తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జ్వరాలు అదుపులోకి వచ్చేంత వరకు శిబిరం కొనసాగిస్తామన్నారు. తండాలో ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం కొత్తపల్లిలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. యంత్ర ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డిలు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చందర్‌నాయక్ తండాలో..



పూజలు చేస్తున్న వేద పండితులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం చందర్‌నాయక్ తండాలో భవాని సమేత సేవాలాల్ మహరాజ్ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండప ఆరాధనలు, ఆవాహిత దేవత హోమాధులు, ధాన్య, ఫల, పుష్పాదివాసం, నైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్ ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో తండావాసులు తుకరాం పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్లకు బోనాలు



బోనాల ఊరేగింపు

వట్‌పల్లి(అందోల్): మండలంలోని ఉసిరికపల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మ, దుర్గమ్మ అమ్మవార్లకు బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా పురవీధుల గుండా డప్పు చప్పుల మధ్య ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు కట్టమైసమ్మ ఉత్సవాలు

నారాయణఖేడ్: పట్టణంలోని జీవన్ కన్వెన్షన్ సమీపంలో మంగళవారం నుంచి 22 వరకు కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు నాగం బ్రదర్స్ పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా హోమం, పూజలు, 23న బోనాల ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విత్తనాల కోసం ఎదురుచూపులు

- జీలుగు, జనుము అందేనా?
- 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం
- సాగు ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- మండలంలో వరి సాగుకే రైతుల మొగ్గు

హత్నూర, (సంగారెడ్డి): వ్యవసాయ పొలంలో భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. యాసంగి సాగు ముగియడంతో వర్షాకాలం సాగుపై రైతులు దృష్టి సారించారు. ఈనెల 25న ప్రారంభమయ్యే రోహిణి కార్తె నుంచి వ్యవసాయ పనులు ప్రారంభిస్తే పంటల దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుందని రైతుల నమ్మకం. ఇప్పటికే దుక్కులు దున్నుతున్నారు. కానీ ప్రభుత్వం అందించే సబ్సిడీ జీలుగు, జనుము విత్తనాలు రాకపోవడంతో దిగులు చెందుతున్నారు. హత్నూర మండలంలో 35 వేల ఎకరాల సాగు భూమి ఉండగా యాసంగిలో 19,200 ఎకరాల్లో వరి సాగు, 5500 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ప్రస్తుతం వర్షాకాలంలో 25వేలపై చిలుకు ఎకరాలలో వరుసాగు, 5000 ఎకరాల్లో పత్తి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వరిసాగు కోసం 8,000 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉండగా ప్రైవేట్ సంస్థలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయి. కానీ ముందుగా భూసారాన్ని పెంచేందుకు జీలుగ, జనుము పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి ఏపుగా పెరిగిన తర్వాత పొలంలోనే దున్ని మురుగబెడతారు. దీంతో భూసారం పెంపొందుతుందని రైతులు ఆశాభావం.



జీలుగు పంట

జీలుగు, జనుము విత్తనాల కొరత

మండలంలో 280 క్వింటాళ్ల జీలుగతో పాటు 60 క్వింటాళ్ల జనుము విత్తనాలు సబ్సిడీపై ప్రభుత్వం అందించేందుకు వ్యవసాయ శాఖ మండల అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇంకా రాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పచ్చిరొట్ట ఎరువులు కొరత ఉంది.. దొరికిన ఎక్కువ రేటు ఉందని రైతులు వాపోతున్నారు. పశువుల పేడ ఎరువులు కూడా పొలాల్లో చల్లుకుంటున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీలుగ, జనుము విత్తనాలను అందించాలని ఆయా గ్రామాల రైతులు కోరారు.

జీలుగు విత్తనాలు పంపిణీ చేయాలి



ప్రభుత్వం సబ్సిడీపై అందించే జీలుగు విత్తనాలను వెంటనే పంపిణీ చేయాలి. ఇప్పటికే పచ్చిరొట్టె ఎరువులు వేయాల్సి ఉంది. జీలుగు పొలంలో సాగు చేసి ఏపుగా పెరిగిన తర్వాత అందులోనే మురుగపెట్టి దున్నుతాం. దీని ద్వారా దిగుబడి ఎక్కువగా వస్తుంది. అధికారులు స్పందించి ఇప్పటికైనా సబ్సిడీపై జీలుగు విత్తనాలను అందించాలి.

– కుమార్, రైతు నస్తీపూర్

ప్రతిపాదనలు పంపాం..



మండలానికి అవసరం ఉన్న జీలుగు, జనుము విత్తనాల ప్రతిపాదనను ఉన్నతాధికారులకు పంపించాం. నాలుగైదు రోజుల్లో వస్తాయని తెలుస్తోంది. రాగానే మండలంలోని రైతులందరికీ తెలియజేస్తాం.. అవసరం ఉన్న రైతులు విత్తనాలను తీసుకెళ్లవచ్చు.

–శ్రీనివాస్,
మండల వ్యవసాయ శాఖ అధికారి

అధికారుల అలసత్వం.. ఆదాయానికి గండి

- కమర్షియల్ కాంప్లెక్స్ దుకాణాలు కేటాయించకపోవడంతో నష్టం
- బీఆర్‌ఎస్ నాయకుల ఆరోపణ

జహీరాబాద్ టౌన్: పట్టణంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కమర్షియల్ కాంప్లెక్స్ దుకాణాలను వ్యాపారులకు కేటాయించకపోవడంతో ప్రతి నెల మున్సిపాలిటీకి రూ. 6 లక్షల ఆదాయానికి గండి పడుతుందని మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకులు నామ రవికిరణ్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణంలో రూ.11కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో 63 దుకాణాలను నిర్మించారు. డిసెంబర్ 22న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి కమర్షియల్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. గుత్తేదారుకు రూ.7 కోట్లు ప్రభుత్వం బిల్లులు చెల్లించిందని తెలిపారు. లక్ష రుపాయల డిపాజిట్ తీసుకుని మున్సిపల్ అధికారులు దుకాణాలను వ్యాపారులకు కేటాయించారు. కానీ, నెలలు గడుస్తున్నా దుకాణాలను వ్యాపారులకు అప్పగించకపోవడంపై మండిపడ్డారు. బకాయి బిల్లుల విషయంలో మంత్రి దామోదర రాజనర్సింహ్మ గుత్తేదారుతో మాట్లాడి కలెక్టర్ సమక్షంలో కాంప్లెక్స్ తాళాలను కమిషనర్‌కు అప్పగించారు. అయినా దుకాణాలను మున్సిపల్ అధికారులు వ్యాపారులకు కేటాయించడంలేదని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతినెల రూ.6 లక్షల అద్దె ఆదాయం మున్సిపాలిటీ కోల్పోవాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. దుకాణాలు అప్పగించని యెడల వ్యాపారుల డిపాజిట్ డబ్బులు వడ్డీతో సహా వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు యాకూబ్, తులసీదాస్ గుప్తా, ఆశం, విశ్వేశ్వర్, శంకర్, నిఖిల్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నామ రవికిరణ్, నాయకులు

నేడు చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: లబ్ధిదారులకు సోమవారం సీఎం ఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉ. 10 గంటలకు ఖేడ్, నిజాంపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు. చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి అందజేస్తారని తెలిపారు.

అస్తవ్యస్తంగా భగీరథ నిర్వహణ

నారాయణఖేడ్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం నిర్వహణ కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆరోపించారు. ఖేడ్ మండలం అబ్బెంద శివారులో మిషన్‌భగీరథ పైప్‌లైన్ వారం రోజులుగా లీకేజీ అవడంతో నీటి గుంతల ఏర్పడ్డాయని గ్రామస్తులు గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. గ్రిడ్ డిప్యూటీ ఈఈ పదోన్నతిపై బదిలీ అయి ఆరు నెలలు కావస్తున్నా కొత్త అధికారిని నియమించలేదని మండిపడ్డారు. ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య విధానాలతో ప్రజలు తాగు నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కలెక్టర్ స్పందించి అబ్బెంద సమీపంలో ఏర్పడిన పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేయించాలని కోరారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు సంగప్ప ఉన్నారు.



లీకేజీతో ఏర్పడిన గుంటను పరిశీలిస్తున్న నాయకులు

రేపు ఇంటర్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్

నారాయణఖేడ్: గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో పరిమితంగా ఉన్న సీట్లలో ప్రవేశం కోసం మంగళవారం ఉ.10 గంటలకు కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్‌లకు ఎంపిక

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన 5మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. 8వ తరగతిలో ఉన్నప్పుడే విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం అర్హత పరీక్షలు రాశారు. మణికర్ణిక, అశ్రిత, దీపక్‌కుమార్, కళ్యాణ్ కుమార్, శ్రద్ధ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 9వతరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తియ్యే వరకు ప్రతి ఏటా రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు వస్తాయన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఆమె అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు అండ



నర్సాపూర్: సీఎం సహాయనిధి పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. నర్సాపూర్, శివ్వంపేట మండలాలకు చెందిన పలు వురు లబ్దిదారులకు మంజూరైన సహాయనిధి చెక్కులను ఆదివారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులలో వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్‌నుంచి ఆర్థిక సహాయం అందజేయిస్తున్నామన్నారు. ఆమె వెంట నాయకులు సత్యంగౌడ్, రమణగౌడ్ ఉన్నారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా!

పీసీబీ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం



పరిశ్రమ నుంచి వెలువడుతున్న వాయుకాలుష్యం

జిన్నారం (పటాన్‌చెరు): పరిశ్రమలు వెదజల్లుతున్న వాయుకాలుష్యంతో పారిశ్రామివాడ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని ప్రజలు వాయుకాలుష్యంలో సతమతమతున్నారు. ఆదివారం ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమ నుంచి వెలువడిన వాయుకాలుష్యం ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఊపిరి తీసుకోవాలంటేనే భయపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులతో అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. దీనిపై పీసీబీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. పీసీబీ అధికారులు వైఫల్యం కారణంగా పరిశ్రమలు విచ్చలవిడిగా వాతావరణంలోకి విషవాయులను విడుదల చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పభుత్వాలు మారుతున్న కాలుష్య సమస్య పరిష్కారం కావడంలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి పరిశ్రమల కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

డంపింగ్ యార్డును రద్దు చేయండి

సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 103వ రోజుకు చేరాయి. నల్లవల్లితో పాటు పలు గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు శాంతియుతంగా కొనసాగుతున్నాయి. నల్లవల్లిలో కొనసాగుతున్న దీక్షకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక రైతులు, గ్రామస్తులు 100 రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన పేరుతో ప్రజావ్యతిరేక చర్యలకు డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిదర్శనమన్నారు. డంపింగ్ యార్డ్ రద్దు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుమ్మడిదల రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, దేవేందర్ రెడ్డి, సుర్యనారాయణ, చక్రపాణి, వినోద్‌గౌడ్, వెంకటేష్ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న గోవర్ధన్‌రెడ్డి, గ్రామస్తులు

బసవేశ్వరుడి అడుగుజాడల్లో నడవాలి

ఝరాసంగం(జహీరాబాద్): విశ్వగురు మహాత్మా బసవేశ్వరుడి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పీఠాధిపతులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మెదపల్లి గ్రామంలో నిర్మించిన బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, కేతకీ ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు శంకర్ పాటిల్, గ్రామ పెద్దలు మల్లన్న పాటిల్, సంగమేశ్వర్, పరమేశ్వర్ పాటిల్, వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు డా. సిద్ధేశ్వర స్వామి, మల్లయగిరి అవధూత గిరి బసవలింగ మహరాజ్, వీరేశ్వర శివాచార్య స్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతులు

ఘనంగా స్వామివారి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న కాలనీవాసులు

సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని గొల్లగూడెం కాలనీ మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున్న స్వామివారికి బోనాలు సమర్పించారు. ఆలయంలో అగ్నిగుండం కార్యక్రమం, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజర్యారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆహ్వానం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్‌లో నిర్మించిన గురుపీఠంలో వచ్చే నెల 3 నుంచి 5 వరకు ప్రతిష్ఠించనున్న సాయిబాబా, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్ఠమహోత్సవాన్ని విజయవంతం చేయాలని గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ కోరారు. ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ హన్మంత్‌రావుతో పాటు పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వివేక్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న శివకుమార్‌గౌడ్



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అమరులకు నివాళి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పహల్గాం అమరులకు, పాక్ కాల్పుల్లో అమరులైన వీర జవాన్లకు నివాళిగా ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు సాయి శేఖర్, యాదగిరి, పెదులు, రాజు, శంకర్, భిక్షపతి, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం!

- విలీన గ్రామాల్లో పేరుకున్న సమస్యలు
- రోడ్డుపై పారుతున్న మురికినీరు

జహీరాబాద్ టౌన్: విలీనమైన పంచాయతీ పరిధిలోని కాలనీల్లో అభివృద్ధి పడకేసింది. మున్సిపల్ పరిధి విస్తరించినా ఆశించిన మేరకు ప్రగతి పనులు జరగడం లేదు. రోడ్లు, మురికి కాల్వలు, కల్వర్టు, తాగునీరు, కరెంట్ వంటి సమస్యలు ఇప్పటికీ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కాలువలు లేక మురికి నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. విలీనమైన ఐదు పంచాయతీలను మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్‌లో విలీనమైన అల్లీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటరమణ నగర్ కాలనీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్లపై గుంతలు పడడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతుంది. మురికి కాల్వలు లేక వాహనదారులు, ప్రజలు మురికినీటిపైనే రాకపోకలు సాగిస్తున్నారు. హౌసింగ్‌బోర్డు నుంచి వెంకటరమణ నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి కూడా అధ్వానంగా తయారైంది. మున్సిపల్‌లో విలీనమైన పస్తాపూర్, రంజోల్, చిన్నహైదరాబాద్, హోతి(కె) పంచాయతీ పరిధిలోని కాలనీల్లో కూడా పరిశుభ్రం లోపించింది. మున్సిపల్‌కు కౌన్సిల్ లేకపోవడం వల్ల పట్టించుకునే వారు కరువైయ్యారు. మున్సిపల్ అధికారులు స్పందించి విలీన పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా వెంకటరమణ నగర్‌కాలనీ

అధ్వానంగా రోడ్లు

అల్లీపూర్ పంచాయతీ పరిధిలోని వెంకటరమణనగర్ కాలనీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇళ్ల ముందే మురికినీరు నిలిచి దోమలు స్వైర విహారం చేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మురికి కాల్వలు, సీసీ రోడ్లు వేయాలి.

–రమేష్, వెంకటరమణ నగర్ కాలనీ

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. కొత్తగా విలీనమై ఐదు పంచాయతీల్లో కూడా తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నాం.

–ఉమామహేశ్వర్‌రావు,
మున్సిపల్ కమిషనర్